# బీఆర్ఎస్‌లో చేరికల జోరు

- మంత్రి కేటీఆర్ సమక్షంలో పలువురు ముఖ్య నేతల చేరిక
- మర్యాదపూర్వకంగా కేటీఆర్‌ను కలిసిన నేతి విద్యాసాగర్
- జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేల నేతృత్వంలో వ్యూహరచన



మంత్రి కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన శాసనమండలి డిప్యూటీ మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్, చిత్రంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్10(నమస్తే తెలంగాణ): ఉమ్మడి నల్లగొండ జిల్లా బీఆర్ఎస్‌లో చేరికల జోరు కొనసాగుతున్నది. సీఎం కేసీఆర్ నాయకత్వ పటిమకు, సర్కార్ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఇప్పటికే గ్రామ స్థాయి, మండల స్థాయి నేతలు పెద్ద సంఖ్యలో నిత్యం పార్టీలో చేరుతున్న విషయం తెలిసిందే. గత కొద్ది రోజులుగా కాంగ్రెస్, బీజేపీ లాంటి విపక్ష పార్టీల్లో నెలకొన్న గందరగోళ పరిస్థితులు, అభ్యర్థుల ఎంపికలో ఆధిపత్య పోరు, టికెట్ అమ్ముకుంటున్నారని ముఖ్య నేతలపై ఆరోపణలు, తదితర అంశాలతో ద్వితీయ శ్రేణి నేతలతో పాటు ఆయా నియోజకవర్గాల్లో కీలక నేతలు సైతం బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ఒకవేళ వీళ్లు అధికారంలోకి వస్తే.. రాష్ట్రాన్ని కుక్కలు చించిన విస్తరిలా చేస్తారన్న అనుమానాలు వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్షగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి వ్యూహరచన, చొరవతో ఆయా నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో చేరికలు కొనసాగుతున్నాయి. మంగళవారం ప్రగతిభవన్ వేదికగా పలువురు కీలక నేతలు పార్టీలో చేరారు. ఆలేరు నియోజకవర్గానికి చెందిన పీసీసీ మాజీ కార్యదర్శి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నేత చామల ఉదయ్ చందర్‌రెడ్డి మంత్రి జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్‌ను కలిశారు. కేటీఆర్ ఉదయ్‌చందర్‌రెడ్డితో పాటు ఆయన వెంట వచ్చిన పలువురికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆలేరులో ఎమ్మెల్యే సునీతామహేందర్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం కోసం కృషి చేస్తామని ప్రకటించారు. ఇక హుజూర్‌నగర్ నియోజకవర్గం మేళ్లచెర్వుకు చెందిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్, వైఎస్ఆర్‌టీపీ ఇన్‌చార్జి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు కూడా బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి సారథ్యంలో మంత్రి కేటీఆర్ సమక్షంలో వెంకటేశ్వర్లు గులాబీ కండువా కప్పుకుని పార్టీ విజయం కోసం పనిచేస్తానని ప్రకటించారు.

### నల్లగొండలో..

నల్లగొండకు చెందిన చకిలం అనిల్‌కుమార్ తిరిగి మాతృసంస్థలోకి వచ్చారు. ఇటీవల పలు కారణాలతో పార్టీకి రాజీనామా చేసిన ఆయన మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డి సారథ్యంలో కేటీఆర్‌ను కలిశారు. పార్టీ అభ్యర్థి విజయానికి పనిచేస్తానని స్పష్టం చేశారు. దేవరకొండకు చెందిన కాంగ్రెస్ నేత కేతావత్ బీల్యానాయక్ కూడా బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ నేతృత్వంలో బీల్యానాయక్ బుధవారం కేటీఆర్ సమక్షంలో తన అనుచరులతో గులాబీ కండువా కప్పుకోనున్నట్లు ప్రకటించారు. ఇక మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ మంగళవారం ప్రగతిభవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో పార్టీ అభ్యర్థుల గెలుపుతో పాటు నకిరేకల్‌లో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య గెలుపు కోసం పనిచేస్తానని కేటీఆర్‌కు వివరించారు. మంత్రి జగదీశ్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, గాదరి కిశోర్‌కుమార్, శానంపూడి సైదిరెడ్డి, పార్టీ నేతలు నంద్యాల దయాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.



మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు ఉదయ్‌చందర్‌రెడ్డి

# ఆలేరులో కాంగ్రెస్‌కు బిగ్ షాక్

- ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు ఉదయ్‌చందర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్‌లో పలువురి చేరిక
- పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి కేటీఆర్

యాదగిరిగుట్ట, అక్టోబర్ 10 : ఆలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యూఐ మాజీ జిల్లా అధ్యక్షుడు చామల ఉదయ్‌చందర్‌రెడ్డి ప్రగతి భవన్‌లో మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్‌రావు సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ఆలేరులో గులాబీ జెండా ఎగురబోతుందన్నారు. బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించి కేసీఆర్ మరోసారి సీఎం అవుతారని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో యాదగిరిగుట్ట మండలంలోని దాతారుపల్లికి చెందిన తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ అన్వేశ్, ఐఎంఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ భానుచందర్, గౌరాయిపల్లికి చెందిన వడ్లకొండ శ్రీకాంత్, మోటకొండూర్‌కు చెందిన భాను చందర్‌రెడ్డి, చాడ గ్రామానికి చెందిన మోకు దెబ్బ రాష్ట్ర నాయకుడు కూరెళ్ల నరేశ్‌గౌడ్, నాంచారిపేటకు చెందిన గంధమల్ల కరుణాకర్, ఆత్మకూరు(ఎం)కు చెందిన తిరునగరి ఫణిందర్, కొండాపూర్‌కు చెందిన కొప్పుల నర్సిరెడ్డి, రుస్తాపూర్‌కు చెందిన కొండపురం శ్రీహరి, శ్రీకాంత్, తేర్యాలకు చెందిన చామల మేఘారెడ్డి, రాఘవపురానికి చెందిన భగవంత్ రెడ్డి ఉన్నారు.

### మంత్రి కేటీఆర్ సమక్షంలో జేవీఆర్ చేరిక

మేళ్లచెర్వు/ హుజూర్‌నగర్ : మండల కేంద్రానికి చెందిన వైఎస్ఆర్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జిల్లేపల్లి వెంకటేశ్వర్లు బీఆర్ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, హుజూర్‌నగర్, నల్లగొండ ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా హుజూర్‌నగర్‌లో హేమ్లాతండా, జగ్గు తండాలకు చెందిన కాంగ్రెస్, టీడీపీకి చెందిన 100కుటుంబాల వారు బీఆర్ఎస్‌లో చేరారు.

# బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్
- కోడూరు గ్రామస్తులు చేరిక



ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల కార్యకర్తలు

అర్వపల్లి, అక్టోబర్ 10 : వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు 30మంది తిరుమలగిరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు నచ్చి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్, నిద్ర సంతు పాల్గొన్నారు.

### మోత్కూరులో..

మోత్కూరు : ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు జంగ నర్సయ్య హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ నివాసంలో ఆయన సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరిగిన ప్రగతిని చూసి పార్టీలకతీతంగా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో రైతు బంధు జిల్లా కమిటీ సభ్యుడు జంగ శ్రీను, శాఖ గ్రంథాలయం చైర్మన్ కోమటి మత్స్యగిరితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దు

- ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్



కాంగ్రెస్, బీజేపీ నాయకులకు గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ, అక్టోబర్ 10 : ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండ మండలంలోని చింతబావి గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు 70మంది పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలకు నచ్చి బీఆర్ఎస్‌లో పలువురు చేరుతున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ పాలన మరోసారి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడా అమలు కాని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సలహాదారుడు మారుపాకుల సురేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాశ్‌గౌడ్, సర్పంచ్ నోముల మల్లేశ్‌యాదవ్, అంజయ్య, బొడ్డుపల్లి కృష్ణ పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

- ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్
- 45కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరిక

హాలియా, అక్టోబర్ 6 : బీఆర్ఎస్‌తోనే రాష్ట్ర పురోభివృద్ధి సాధ్యమని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. గుర్రంపోడు మండల కేంద్రానికి చెందిన 45 కాంగ్రెస్ పార్టీ కుటుంబాల వారు ఆ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి సాదరంగా బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలైతున్నాయని అన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన సాగుతుందని అన్నారు. నలబై ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చేయలేని అభివృద్ధిని పదేళ్లలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం చేసి చూపించిందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడ వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, బీమా, దళిత బంధు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు లేవన్నా రు. ఆ రెండు పార్టీలు దొందు దొందే అని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలంతా బీఆర్ఎస్‌కు ఓటేసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఇద్దయ్య, గంగసారి రవీశ్వర్‌బాబు, మిట్టపల్లి గణేశ్, అశోక్, పోలేపల్లి రవి, కొప్పోజు ఆండాలు, పగడోజు నాగమణి, అలుగుల లింగమ్మతో పాటు మరో 35 కుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, అమరేందర్ రెడ్డి, సైదిరెడ్డి, గోవర్ధన్‌చారి, యాదయ్య, సయ్యద్‌బాబా, అమీర్, మహమూద్ పాల్గొన్నారు.



హాలియాలోని క్యాంపు కార్యాలయంలో గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

### నల్లగొండలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు



నీలగిరి, అక్టోబర్ 10 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నల్లగొండ టూ టౌన్ సీఐ నాగదుర్గప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం పానగల్ ప్రాంతంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) కవాత్తు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రజలకు భద్రతపై భరోసా కల్పించేందుకు వీధుల్లో రూట్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.